
కామారెడ్డితో ఆత్మీయ బంధం.. 2




ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి 2



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
21-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు..



**అక్షరటుడే, బోధన్:** బోధన్ నియోజకవర్గంలో వేసవిలో తాగునీటికి కొరత లేకుండా చర్యలు చేపట్టామని సబ్ కలెక్టర్ వికాస్ మహతో తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని పాండు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా పాండు చెరువును పరిశీలించిన అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి సందర్భంగా చెరువును ఒక జలవనరుగా పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఆచన్‌పల్లి డంపింగ్ యార్డులో నిర్మిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు.



## జీపీ నూతన భవనాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు: ఎమ్మెల్యే పోచారం


**అక్షరటుడే, బాన్సువాడ:** గ్రామ పంచాయతీ భవన నిర్మాణం ద్వారా గ్రామస్థులకు మెరుగైన పరిపాలన సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వర్ని మండలం వకీల్ ఫారం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి పోచారం భూమిపూజ చేశారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి పంచాయతీ కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే పోచారం పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామన్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వర్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్ బాబా, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ డీసీపీ బస్వారెడ్డికి వీడ్కోలు..




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** జిల్లాలో అడిషనల్ డీసీపీగా సేవలందించిన బస్వారెడ్డికి సీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ.. బస్వారెడ్డి గతంలో జిల్లాలోనే ఎస్సైగా పనిచేశారని.. అనంతరం సీఐగా, ఏసీపీగా సేవలందించారన్నారు. అదనపు డీసీపీగా విధులు నిర్వహిస్తూ తాజాగా చీఫ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారన్నారు. మృదు స్వభావిగా పేరున్న ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. శాంతిభద్రతల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ సీపీ సాయిచైతన్య, జనరల్ సెక్రెటరీ డాక్టర్ కవితా రెడ్డి, ట్రెజరర్ సంతోష్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కాకతీయ విద్యాసంస్థల అధినేత రజనీకాంత్ తదితరులు హాజరై బస్వారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, అభిమానులు సీపీ కార్యాలయానికి వచ్చి బస్వారెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన స్థానంలో ఐపీఎస్ అధికారి శుభం ప్రకాష్ నియమితులయ్యారు.

**జిల్లాలో గ్యాస్ సిలిండర్ల విక్రయం అక్రమ మార్గంలో సాగుతోంది. సామాన్యుడి అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు డీలర్లు, మధ్యవర్తులు బ్లాక్ మార్కెట్‌కు తెరలేపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అధికంగా వసూలు చేస్తూ వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నారు. ముఖ్యంగా ఎడపల్లి, ఆర్మూర్, నిజామాబాద్ టౌన్ పరిధిలో ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది.** – అక్షరటుడే, భీమ్‌గల్



# బ్లాక్‌లో సిలిండర్ల విక్రయాలు

■ అధిక ధరలకు విక్రయిస్తున్న వైనం ■ డీలర్లు, ఏజెన్సీల మాయజాలం ■ పట్టించుకోని అధికారులు

నిబంధనల ప్రకారం గృహ అవసరాలకు వాడాల్సిన (డొమెస్టిక్) సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడడం నేరం. కానీ జిల్లాలోని పలు హోటళ్లు, టీ స్టాళ్లు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్లనే వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ ధర భారంగా ఉండడంతో, ఏజెంట్లు కుమ్మక్కై సబ్సిడీ సిలిండర్లను ఇటు మళ్లిస్తున్నారు. దీంతో సాధారణ వినియోగదారులకు సకాలంలో సిలిండర్లు అందక 'రీఫిల్లింగ్' కోసం వారాల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. జిల్లాలో ఉజ్వల పథకం కింద 2,72,700 గ్యాస్ కనెక్షన్లు, దీపం పథకం కింద 2,53,400 కనెక్షన్లు ఉన్నాయి. కమర్షియల్, ఇతర కనెక్షన్లు 3,950 వరకు ఉన్నాయి.

### అక్రమ విక్రయాలు ఇలా..

గృహావసరాల సిలిండర్ ధర సుమారు రూ.950 ఉండగా, బ్లాక్ మార్కెట్‌లో రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు. వ్యాపార అవసరాల కోసం వినియోగించే సిలిండర్లను రూ.3వేల పైచిలుకు ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వినియోగదారులు గ్యాస్ బుక్ చేసిన వెంటనే డెలివరీ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వస్తోంది. కానీ వారం రోజులైనా సిలిండర్ ఇంటికి చేరడం లేదు. తీరా ఏజెన్సీని ప్రశ్నిస్తే 'స్టాక్ లేదు' అని సమాధానం ఇస్తున్నారు. అయితే వారి సిలిండర్‌ను బ్లాక్‌లో అధిక ధరకు అమ్ముకుంటున్నారు. ప్రశ్నించిన వారికి తర్వాత అందిస్తున్నారు.

### ఇక్కడ అధికం

ఎడపల్లి, ఆర్మూర్ ప్రాంతాల్లోని కొన్ని ఏజెన్సీల సిబ్బంది నేరుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిజామాబాద్ టౌన్ పరిధిలో రీఫిల్లింగ్ దందా కూడా జోరుగా సాగుతోంది. గ్యాస్ కొరత ఉందని సాకులు చెబుతూ, తెరవెనుక అధిక ధరలకు విక్రయించే ముఠాలు క్రియాశీలకంగా మారాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. తనిఖీలు నిర్వహించి, అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### అక్రమాలకు పాల్పడితే చర్యలు

గృహావసరాలకు వినియోగించే డొమెస్టిక్ సిలిండర్లను మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తే ఆయా ఏజెన్సీల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. అక్రమంగా సిలిండర్ విక్రయిస్తున్న వారిపై ప్రజలు ఫిర్యాదు చేయాలి. అవసరమైతే క్షేత్రస్థాయిలో మరో మారు తనిఖీలు చేపడతాం.

– శ్రీకాంత్, జిల్లా సివిల్ సప్లై అధికారి



## కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి..

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. కామారెడ్డి మండలం గర్గుల్, రామారెడ్డి మండలం గోకుల్ తండాల్లో మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో కొనుగోళ్ల తీరుపై స్టీఫెన్ రవీంద్ర రైతులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులను ఆరాతీశారు. అనంతరం ప్యాడీ కొనుగోళ్లలో భాగంగా పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని, రైతులకు చెల్లింపులు త్వరగా జరిగేందుకు ఓపీఎంఎస్ ట్యాబ్ లలో నమోదును సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఆర్డీవో ప్రభాకర్ రైతులకు సూచించారు. ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆర్డీవో ప్రభాకర్ తహశీల్దార్ ప్రేమ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐకేపీ సెంటర్‌లో అన్ని వసతులు కల్పించి కొనుగోళ్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. తూకం వేసిన బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రామనారాయణ గౌడ్, సీసీలు, రైతులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో గ్రామాలకు భద్రత : సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని.. గ్రామాలకు సీసీ కెమెరాలతో భద్రత ఉంటుందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు 'అరైవ్ అలైవ్ - 2026' కార్యక్రమంలో భాగంగా రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైం ప్రివెన్షన్, డ్రగ్స్ నియంత్రణ, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లపై సర్పంచ్‌లు, కౌన్సిలర్లకు బోధన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఒక్క యాక్సిడెంట్ జరుగకుండా ఉన్న దేశం ఫిన్లాండ్ అని అన్నారు. వ్యవసాయదారులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టినప్పుడు భద్రత కోన్లు, లేదా బకెట్ పెట్టి స్టిక్కర్లు అంటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లు వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు వాహనాల మధ్య తగినంత దూరం ఉండేటట్లు చూసుకోవాలన్నారు. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా ప్రతి ఒక్కరూ గమనిస్తూ ఉండాలని, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక వేగం, క్రమశిక్షణ లోపం, అలసటతో వాహనం నడపడం వంటి అంశాలు ప్రమాదాలకు దారితీస్తాయని సీపీ వివరించారు. 2020 సంవత్సరంలో కరోనా ఫేస్-1, ఫేస్-2లో నిజామాబాద్ జిల్లాలో దాదాపు 200 మంది మృతి చెందారని.. అదే 2025లో రోడ్డు ప్రమాదాల వల్ల దాదాపు 302 మంది మృతి చెందారని వివరించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, బోధన్ మున్సిపల్ ఛైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఇలియాస్, బోధన్ టౌన్ ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణ, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూర్ సీఐ శ్రీకృష్ణ, బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, ఎన్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాంబశివ రావు, ఎన్ఎస్ఈ మెంబర్స్ దుష్యంత్, కొడాలి కిషోర్, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్, బోధన్ టౌన్ ఎస్సై మనోజ్, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, కోటగిరి ఎస్సై సునీల్, సర్పంచులు కౌన్సిలర్లు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.


## మత్తు పదార్థాల నిరోధానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, అవలంభించాల్సిన విధానాలపై అధికారులకు అదనపు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలంను కట్టడి చేసేందుకు గట్టి నిఘా ఉంచాలన్నారు. క్లోరోఫాం, డైజోఫాం, అల్ప్రాజోలం వంటి వాటిని వినియోగిస్తూ తయారు చేసిన కల్తీ కల్లు సేవిస్తుండడం వల్ల అనేక మంది అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఎవరు కూడా కల్తీ కల్లు బారిన పడకుండా గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని సూచించారు. నిరంతర దాడులు కొనసాగిస్తూనే, మత్తు పదార్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ వారిని చైతన్యపర్చాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నిజామాబాద్ జోన్ ఏసీపీ సోమనాథం, ఏసీపీ ప్రకాష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, డీఐఈవో రవికుమార్, ఎంవీఐ శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్, సైకియాట్రిస్ట్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.




## పంట కొనుగోళ్లపై కొర్రీలు పెట్టడం సరికాదు..

**అక్షరటుడే, కామారెడ్డి:** రైతులు పండించిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం కొంతమేరకు మాత్రమే కొనుగోలు చేస్తామని కొర్రీలు పెట్టడం సరికాదని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ రెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పైడి విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం పంటలకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా కొనుగోలు కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్ విధానాన్ని తొలగించాలన్నారు. పంటలు పండించి దేశానికి అన్నం పెడుతున్న రైతులను అడుక్కునేలా చేశారని, రైతులకు కావాల్సిన ప్రతీది కొట్లాడి సాధించుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వ్యాపారులు మొక్కజొన్నకు క్వింటాలుకు రూ.1,600 నుంచి రూ.1,800 మాత్రమే కొనుగోలు చేస్తుందని, ప్రభుత్వం మాత్రం రూ.2400 చొప్పున కొనుగోలు చేస్తామని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND



“ ‘కామారెడ్డి జిల్లాతో ఆత్మీయ అనుబంధం ఏర్పడింది. ఇక్కడ నుంచి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. కానీ వెళ్లాల్సిందే.. ఇక్కడ సవాళ్లతో నిండిన కేసులు, మహిళల భద్రత కోసం తీసుకున్న కఠిన చర్యలు, ప్రజలు తనపై ఉంచుకున్న నమ్మకం ఇవన్నీ తన సేవా కాలాన్ని మరపురాని జ్ఞాపకాలుగా మార్చాయి’ అని కామారెడ్డి సబ్‌డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు.

- అక్షరటుడే, కామారెడ్డి

### ఆటుపోట్లను అధిగమించి.. ఐపీఎస్ కిరీటం చేజిక్కించుకుని

చిన్ననాటి నుంచి తల్లిదండ్రుల ప్రేరణతో ఎదిగిన చైతన్య రెడ్డి, సివిల్స్‌పై దృష్టి పెట్టి ఎన్నో ఆటుపోట్లను అధిగమించి ఐపీఎస్ సాధించారు. “అమ్మానాన్నల ప్రోత్సాహమే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది..” అని చైతన్య రెడ్డి పేర్కొన్నారు.

### పోక్సో కేసుల్లో నిష్పక్షపాత దర్యాప్తు

జిల్లాలో పోక్సో కేసులు పెరిగినప్పటికీ, ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారించామని ఐపీఎస్ తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొన్నారు. అవగాహన లోపం వల్ల వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.



# కామారెడ్డితో ఆత్మీయ అనుబంధం..

- ఈ ప్రాంత ప్రజలతో మమేకమయ్యా..
- ఇక్కడి నుంచి వెళ్లాలంటే బాధగా ఉంది
- చాలా కేసులు ఛాలెంజ్‌గా తీసుకుని పరిష్కరించా..
- మహిళా కేసుల విచారణలో పారదర్శకత పెంచాం
- ‘అక్షరటుడే’తో ఐపీఎస్ చైతన్య రెడ్డి

జనవరి 1, 2025 న బాధ్యతలు కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ స్వీకరించిన చైతన్య రెడ్డి సుమారు 14 నెలల పాటు జిల్లాలో సేవలందించి, తనదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ప్రస్తుతం పదోన్నతి పొంది సంగారెడ్డి అడిషనల్ ఎస్పీ గా వెళ్తున్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లాతో ఏర్పడిన అనుబంధాన్ని, తన అనుభవాలను పంచుకున్నారు.

#### మొదటి పోస్టింగ్..

ఏఎస్పీగా కామారెడ్డి తన మొదటి పోస్టింగ్ అని చైతన్య రెడ్డి తెలిపారు. ఇద్దరు ఎస్పీలతో కలిసి పనిచేసే అవకాశం తనకు అనేక విషయాలు నేర్పిందన్నారు. ఈ జిల్లాలో తాను పొందిన అనుభవం తన భవిష్యత్తు సేవా ప్రయాణానికి బలమైన పునాది అయ్యిందని పేర్కొన్నారు.

#### సవాళ్ల మధ్య సేవ

కామారెడ్డి జిల్లాలో మోసాలు, దొంగతనాలు, హత్యలు, నకిలీ కరెన్సీ కేసులు తనకు పెద్ద సవాళ్లుగా నిలిచాయని చైతన్య రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర గ్యాంగ్‌లను పట్టుకునేందుకు ఇతర రాష్ట్రాలకు వెళ్లడం ప్రత్యేక అనుభవంగా నిలిచిందని పేర్కొన్నారు. “ఆపరేషన్ కవచ్” ద్వారా సదరు ముఠాలను కట్టడి చేయగలిగామని తెలిపారు.

#### ప్రజల ప్రేమ.. విడిచిపెట్టలేని బంధం

“కామారెడ్డి ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు. అదే నాకు ఈ ప్రాంతంతో ఎమోషనల్ అటాచ్‌మెంట్ పెంచింది. వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నా.. నా మనసు మాత్రం ఇక్కడే ఉండిపోతుంది..” అని ఆమె అన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై, ముఖ్యంగా మహిళలు తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకొనే వాతావరణాన్ని సృష్టించగలిగామని చైతన్య రెడ్డి చెప్పారు.

#### మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

మహిళల కేసుల్లో పారదర్శకతను పెంచేందుకు కృషి చేసినట్లు చైతన్య రెడ్డి చెప్పారు. షీ టీమ్‌ను బలోపేతం చేసి, స్వయంగా పర్యవేక్షించామని అన్నారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ధైర్యం పెరిగిందని, నేరుగా ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. ఫిర్యాదు చేయడానికి సంకోచించే బాధితుల వద్దకు మఫ్టీలో వెళ్లి ధైర్యం చెప్పిన ఘటనలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

#### యువతకు సందేశం

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. “గంజాయి, మద్యం వంటి వాటికి బానిస అయితే భవిష్యత్తు చీకటిలో పడుతుంది.. చదువు, లక్ష్యం మీద దృష్టి పెట్టాలి..” అని ఆమె సూచించారు.


కుటుంబంతో ఏఎస్పీ చైతన్య రెడ్డి..

#### ఆటుపోట్లను అధిగమించి.. ఐపీఎస్ కిరీటం..

చిన్ననాటి నుంచి తల్లిదండ్రుల ప్రేరణతో ఎదిగిన చైతన్య రెడ్డి, సివిల్స్‌పై దృష్టి పెట్టి ఎన్నో ఆటుపోట్లను అధిగమించి ఐపీఎస్ సాధించారు. “అమ్మానాన్నల ప్రోత్సాహమే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది..” అని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభం..



**అక్షరటుడే, ఆర్మూర్ :** మండలంలోని చేపూర్ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం సర్పంచ్ సరంగి శాంతి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింధుకార్ చరణ్, వీడీసీ అధ్యక్షుడు మినుగు నాగరాజ్, వార్డ్ మెంబర్లు గంగా సాయిలు, ప్రసాద్, రాజు, రఘు, రవి కిరణ్, వీడీసీ సభ్యులు దశరథ్, ఫీల్డ్ అసిస్టెంట్ రజిత, దాసరి చిన్న శ్రీనివాస్ కార్మికులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ధోబిఘాట్ వద్ద ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆర్మూర్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాటిపల్లి వెంకట్ రెడ్డి, రైతు సంఘాల నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పీఏసీఎస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రైతు నాయకులు కలిగోట గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత..




**అక్షరటుడే, ఇందూరు:** పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఈనెల 22న ధరిత్రి దినోత్సవం సందర్భంగా..కలెక్టరేట్ లో పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి అంశాల్లో ప్రతిఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని అన్ని వర్గాలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ పోస్టర్లను జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల వద్ద ప్రదర్శించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, డీఎస్పీ సోమనాథం, డీఐఈవో రవికుమార్, సైకియాట్రిస్ట్ రవితేజ, ఎఫ్ఆర్‌వో సంజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార లోపం నివారణపై అవగాహన

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం మిర్దాపల్లి గ్రామంలో పోషణ్ పక్వాడాలో భాగంగా పోషకాహార లోపం నివారణపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాధర్, సూపర్‌వైజర్ సమత మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు పోషకాహార లోపాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహార సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## పండ్లు కొనేందుకు వెళ్లిన వ్యక్తిని కబలించిన ఆర్టీసీ బస్సు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పండ్లు కొనేందుకు రోడ్డుపైకి వచ్చిన వ్యక్తి ఆర్టీసీ బస్సు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఏమిలి అరుణ్ (45) పండ్లు కొనుగోలు చేయడానికి ఎల్లారెడ్డి బస్టాండ్‌కు నడుచుకుంటూ వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో కామారెడ్డి నుండి ఎల్లారెడ్డి పట్టణానికి వస్తున్న బస్సు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి అతడిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మల్లారెడ్డి చెరువును పరిరక్షించాలి..

**అక్షరటుడే,ఆర్మూర్:** పట్టణంలోని మల్లారెడ్డి చెరువును పరిరక్షించాలని ఆర్మూర్ మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి, వైస్‌ఛైర్మన్ కాట్‌పల్లి వెంకటరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మల్లారెడ్డి చెరువులోకి మురికినీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సడక్ వినోద్, గుపాల ఉపేందర్, మున్నూరు కాపు మూడు పంథాల సదర్లు కలికోట గంగాధర్, బొల్లు పోతన్న, మల్లయ్య, గోనె రఘు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ కామారెడ్డి యూనిట్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్ష పదవితో పాటు ఇతర పోస్టులకు సింగిల్ నామినేషన్లు రావడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి డాక్టర్ విజయ భాస్కర్ ప్రకటించారు. ఈనెల 18 వరకు కార్యవర్గంలో పోస్టులకు సంబంధించిన నామినేషన్స్ స్వీకరించారు. ఒక్కో పదవికి ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో కమిటీ మొత్తం ఏకగ్రీవమైంది. నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు మంగళవారం సాయంత్రం వరకు గడువు ఉండడం, ఇతర నామినేషన్స్ రాకపోవడంతో ఏకగ్రీవంగా ప్రకటించారు. డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శరత్, కోశాధికారిగా రాజు, జనరల్ కౌన్సిల్ సభ్యులుగా విజయరాజు, మధుసూదన్, జ్యోతి, ఉపాధ్యక్షులుగా రేఖ, యాదగిరి, ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీలుగా ఎస్.బి కవిత, పార్థసారథి, బి.కవిత, యూనిట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా శివప్రసాద్, శ్రీనివాస్, గౌతమి, సంగీత్ కుమార్, మౌనిక, సమీన మహమ్మద్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి విజయ భాస్కర్ ప్రకటించారు. ఎన్నికైన ఈ కమిటీ 202628 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

## ఇంటర్ టాపర్‌కు సన్మానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్ విద్యార్థిని హారిక 970 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని మంగళవారం స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. నిరుపేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ, చదువుకోవాలనే పట్టుదలతో ఈ ఘనత సాధించడంపై పోలీస్ సిబ్బంది ఆమెను అభినందించారు. కష్టపడి చదువుకున్న హారిక ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అలాగే హారిక ఉద్యోగం సాధించేవరకు ఆమెకు సంబంధించిన చదువుల ఖర్చు పూర్తిగా తానే భరిస్తానని ఎస్సై ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్నత చదువుల నిమిత్తం ఎంట్రన్స్‌ల కోసం దరఖాస్తు ఖర్చులకు రూ.3వేలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని 15, 35వ వార్డుల మధ్యలో ఉన్న ప్రధాన డ్రెయినేజీ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు, వైస్ ఛైర్మన్ కాట్‌పల్లి వెంకట్ రెడ్డి కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర రావ్, 2వ వార్డు కౌన్సిలర్ నాగేంద్ర, 25 వార్డు కౌన్సిలర్ భూపేందర్, 35 వార్డు కౌన్సిలర్ సడక్ వినోద్, కలిగోట శ్రీను, వెంకటేష్, రతన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్మూర్‌లో చలివేంద్రం ఏర్పాటు..




**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆర్మూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కాట్‌పల్లి వెంకటరెడ్డి, కమిషనర్ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ భూపేందర్, సడక్ వినోద్, గోనె రఘు తదితరులు పాల్గొన్నారు.